# కొండలకు గుండెలుంటాయి

పాండ్రంకి సుబ్రమణి

ఆ ఇంట్లోని సందడి సంకీర్ణ మంత్రిమండలి అత్యవసర సమావేశంలా హడావిడిగా ఉంటుంది. తల్లీకూతుళ్లు ముగ్గురూ కలివిడిగా అక్కాచెల్లెళ్లలా తచ్చాడుతూ కనిపిస్తారు. మధ్యాహ్నవేళ కాలేజీ నుంచి యింటికి చేరుకున్న తరువాత అక్కాచెల్లెళ్లిద్దరూ తల్లితోపాటు అరుగుపై కూర్చునో, పెరట్లో బుధరీఫలాలను తెంచుకుని తీరుబడిగా జుత్తులు దువ్వుకుంటూ కబుర్లాడతారు. కాలేజీ విశేషాలను ముచ్చటించుకుంటారు.

అయితే వారిమధ్య అప్పుడప్పుడూ అనుకో



కుండా పుట్టుకొచ్చిన అల్పద్రోణిలా చిటపటలు చోటుచేసుకుంటాయి. అకారణంగా వేరుపడ్డ కూటమి మిత్రపక్షాల్లా చీలిపోతుంటారు. అలా ఎందుకు జరుగుతుంది? ఎప్పుడు జరుగుతుం దన్నది ఆ తల్లీకూతుళ్లకే తెలియదు.

ఆ రోజు యధావిధిగా మాటలతో మొద లయి యిరుగుపొరుగు కబుర్లతో కలగలసి, ఎట్టకేలకు ప్రసక్తి నీలకంఠం వరకూ వచ్చి ఆగింది.

'వాడీనాడు అలా అల్లాటప్పాగా తయా రయాడంటే అదంతా అమ్మ చలవే సుశీ! చెల్లిని ఉద్దేశించి మాట్లాడుతూనే ఓరకంట తల్లివేపు చూపుల బాణాలు విసురుతూ అంది సుకన్య. సుభద్రమ్మ సర్రున తలెత్తి చూసింది. ఏదైనా భరిస్తుంది గాని కొడుకుపైన వ్యంగ్యాస్త్రం మాత్రం సహించలేదు.

'వాడూ వీడూ అంటే ఎవడే వాడు? మీ పొరుగింటివాడా? అప్పులు తీసుకొని పారిపో యినవాడా? మర్యాదగా అన్నయ్యానండి. లేదా పేరుపెట్టి పిలవండి. ఉత్తకుండకి ఊపెక్కు వంటారు ఇందుకేనా!'

అక్కాచెల్లెళ్లిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. ఎప్పుడెప్పుడు తల్లి వన్ మ్యాన్ ఆర్మీగా నిలుస్తుందో అప్పుడప్పుడు పెద్దరికపు పరదాతో కూతుళ్ల నోళ్లు నొక్కేస్తుంది. అప్పుడు సుశీల ముందుకు వచ్చింది.

'విత్ రీజన్ ఆర్ వితౌట్ రీజన్... కొడుకుని వెనకేసుకు రావడం అలవాటేగా! అయినా అక్కయ్యా! నేనొక వాస్తవం చెప్పేదా? వాడు – సారీ – మన ముద్దులన్నయ్య అలా ఇంట ర్వ్యూలలోనే కాదు – బ్రతుకు బాటలో కూడా అలా బేలగా తయారయాడంటే...'

అప్పుడు సుభద్రమ్మ చటుక్కున అడ్డువచ్చి ఆపింది.

'కారకులు ఒక్కరు కాదు – యిద్దరు. మొదటి కారకురాలు దేవుడి చెంత చేరిన మా అత్తగారు. గుండెనిబ్బరం గల మగాడే మీసాలు దువ్వగల ధీరుడిగా రాణిస్తాడని మీ అన్నయ్యని బ్రయిన్ వాష్ చేసి వెళ్లిపోయారు. నేనేమో వాణ్ని అపర సత్యహరిశ్చంద్రుడిలా తయారుచేసి వాస్తవ ప్రపంచం నుంచి గిరాటువేసాను. అంతేనా?'

అప్పుడు సుకన్య 'సమయానికి తగు మాట లాడు' కీర్తన చందాన తల్లికి చేరువగా వచ్చి రెండు భుజాలపైన చేతుల్నుంచి 'నేను చెప్పేది కొంచెం వినవే అమ్మా!' అందు గోముగా.

'చెప్పు చెప్పు. అది కూడా విని తరిస్తాను' ఈసారి మెత్తబడ్డ స్వరంతో స్పందించింది సుభ ద్రమ్మ.

'ఓర్పుగా వింటావు కదూ!' సుభద్రమ్మ తలూపింది.

'చిన్నప్పట్నుంచీ అన్నయ్యకేమి చెప్పి ఒప్పిం చేదానివి – ఏది నేర్చుకున్నా అది ఎంతటి చిన్న విషయమైనా మనసు ఉంచి సాధన చేయా లనేదానివి. అలా నేర్చుకున్న విద్య ఏదో ఒకనాడు శివధనుస్సులా అండ నిలుస్తుందనే దానివి. అవునా! మరి మా ముద్దులన్నయ్య ఏంచేసాడు – నీ నీతి బోధనను మరీ సీరియస్ గా తీసుకొని వాడికి ఆసక్తిగల విషయాలను ఒంటబెట్టుకున్నాడు. ప్రాక్టికల్ లైఫ్‌కి దూరంగా జరిగిపోయాడు'.

'అంతటి పనికిరాని కార్యం వాడేంచేసాడే!'

ఈసారి సుశీల తల్లి జబ్బ పట్టుకుని లాగింది. 'నీ మాటల్ని నీలకంఠం ఎలా మెలి తిప్పాడో నేను చెప్తానమ్మా. మేథ్స్ సబ్జెక్ట్ తీసుకున్న తరువాత థియరీస్‌తో ప్రాక్టీస్ చేయ డం మాని, వాడి అకడమిక్ కెరియర్‌కి ఏ

మాత్రమూ సంబంధంలేని మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాడు. దీనిని నేర్చుకోవడానికి ఒక జీవిత కాలం చాలదంటారు బౌద్ధ గురువులు. ఇక చెప్పడానికేముంది? చదువు గట్టెక్కింది. ఇంజనీరింగ్ సీటు దొరక్కుండా పోయింది. ప్రతీదీ అంకితభావంతో అభ్యసించాలన్నావు. సూత్రం బాగానే ఉంది. మరి ఏది ముందు నేర్చుకోవాలో చెప్పావా? ఇంకొకటి కూడా చెప్పేదా అమ్మా - కార్పొరేట్ సంస్థలు ఉద్యోగాల కోసం నిర్దేశించే రెస్యూమ్‌లో అభ్యర్థి గుణగణాలు గురించి వివరించాల్సిన కాలమ్‌లు ప్రవేశ పెట్టలేదు. ఎందుకంటే అటువంటి విలువలు ఇప్పటి పోటీ ప్రపంచంలో నిలవలేవు'.

సుభద్రమ్మ మిన్నకుండిపోయింది. పరధ్యాన నిమగ్నురాలైంది.

* * *

నీలకంఠం ఒక్క ఉదుటున ఆటోరిక్షా దిగి యిరవై రూపాయల నోటుని డ్రైవరు చేతిలో కుక్కి, ఇంటర్వ్యూ హాలువేపు దూసుకువెళ్ళాడు. సందడిగా ఉండాల్సిన హాలు పాడుపడ్డ క్యాంపు ఆఫీసులా ఉంది. ఉలికిపాటుతో అంగలు వేసుకుంటూ వెళ్ళి హాలు తలుపుల్ని బారుగా తెరిచి లోపలికి ప్రవేశించాడు. కుర్చీలు, బెంచీలు వంకరటింకరగా పడి ఉన్నాయి. పనికిరాని చిత్తు పేపర్లు గాలికి ఎగురుతున్నాయి. అంటే తను రాకముందే అంతా అయిపోయిందన్న మాట! అనంత జలరాశిలా ప్రవహించే కాలవాహిని ఎంత విచిత్రమైనది! కొన్ని నిమిషాల జాప్యాన్ని కూడా అది భరించలేదు. మానవ జీవితాల్ని తారుమారుచేస్తుంది.

'ఎవరు కావాలండీ' అన్న గొంతు వినవచ్చిన దిక్కున తలతిప్పి చూసాడు. అటెండరు యూనిఫారమ్‌ని సర్దుకుంటూ నిల్చున్నాడు.

'ఇంటర్వ్యూ...' అని వాక్యాన్ని పూర్తిచేసే లోపల అంటెండరు అందుకుని బదులిచ్చాడు - 'ముగిసి పావుగంట కావస్తోంది. మీరు బస్సు మిస్సయినట్టున్నారయ్యా!' అని అంటూ అతడు బల్లపైనున్న కప్పులూ సాసర్లూ అందుకుని ట్రేలో పేర్చుకుంటూ కదిలాడు.

నీలకంఠం చప్పున అటెండరు భుజంపైన చేయివేసి 'ఇప్పుడెవర్ని కలవాలి?' అని అడిగాడు.

'ఎందుకు?' బౌన్సర్‌లా వచ్చిన ఆ తిరుగు ప్రశ్నకు యేమి బదులివ్వాలో తెలియక 'ఎం.డి. ఛాంబర్ పైఅంతస్తులోనే కదా ఉంది?' అని అడిగాడు.

అటెండరు తల అడ్డంగా తిప్పి - ఎం.డి. గారు లేరిప్పుడు. డిప్యూటీ ఎం.డి. గారు మాత్రం ఉన్నారు. కానీ మీరు వెళ్లలేరు. ఎవర్నీ పైకి పంపించకని మేనేజర్‌గారు ఆదేశాలిచ్చారు' అని బదులిచ్చీ యివ్వడంతోనే నీలకంఠం ఉపగ్రహంలా పైకి దూసుకువెళ్లాడు. తలుపుపైన మునివ్రేళ్లతో తడ్తూ - ఎక్స్క్యూజ్‌మీ సార్' అంటూ లోపలికి ప్రవేశించాడు. అతడి ఊహకు భిన్నంగా ఆ సీట్లో ఓ యవ్వనవతి కూర్చొని ఉంది. ఇంత పిన్న వయసులో యింత పెద్ద హోదాను అలంకరించడమా? కొన్ని క్షణాలు కనురెప్ప మూయకుండా నిల్చున్నాడతను. నిగనిగలాడే నల్లటి జుత్తు విశాలంగా ఫ్లో అయేలా వదులుగా జారవిడిచింది. పసుపురంగు చేనేత చీరపై తెల్లపువ్వుల బుటాలు ఫెళ్లుమంటున్నాయి. లేత గులాబీరంగు రవికె వేసుకుని నుదుట గుండ్రటి కుదురైన బొట్టుతో కార్పొరేట్ ఠీవి ఆమెలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అతడికి అప్రయత్నంగా జంకు వంటి ఫీలింగ్ కలిగి రెండడుగులు వెనక్కి వేసాడు.

అతడి ఆకస్మిక ఆగమనానికి విస్మయం చెందినట్లు దీర్ఘమైన ముఖంపెట్టి చూసిందామె.

‘సారీ మేడమ్. ఐయామ్ రియల్లీ సారీ. కొంచెం ఆలస్యం అయింది. దయచేసి చిన్న అవకాశం యిప్పించండి. మీరడిగిన డిగ్రీ క్వాలిఫికేషన్, స్పోర్ట్స్ క్వాలిఫికేషన్ అన్నీ ఉన్నాయి’.

ఆమె రవంతసేపు అలాగే చూస్తుండిపోయి – ‘ఇంటర్వ్యూ టైమింగ్ మీకు ముందే తెలుసు కదూ!’ అని అడిగింది.

అతడు తలూపుతూ ‘ష్యూర్ మేడమ్. బాగా పెందలకడే బయల్దేరాను మేడమ్. నా బ్యాడ్‌లక్ – అనివార్య పరిస్థితి వల్ల దారి మధ్యలో ఆగిపోవలసి వచ్చింది. ఇటీజ్ ఏన్ అన్‌ఫోర్‌సీన్ ఇన్సిడెంట్’ అని వివరించాడు.

‘ఆ అనివార్య పరిస్థితేమిటో మేం తెలుసుకోవచ్చా?’

అతడేమీ అనకుండా ఆమెకిరువైపులా నిల్చున్న ముగ్గురివేపు ఇబ్బందికరంగా మొఖం పెట్టి చూసాడు.

‘ఎనీ అబ్జెక్షన్?’ ఈ ప్రశ్నకు అతడు కొంచెం తొట్రుపడుతూ.

‘నో మేడమ్. నాట్ ఎటాల్. మాన్‌సింగ్‌నగర్ నుంచి వస్తున్నపుడు ఒక అమ్మాయి అరుపు వినిపించి తిరిగిచూసాను. పట్టపగలని కూడా చూడకుండా యిద్దరు దుండగులు ఆ అమ్మాయిని శిధిలావస్థలో ఉన్న పిట్టగోడవైపు నెట్టుకుంటూ వెళ్తున్నారు. బోలెడంతమంది ఆ వీధిసందున వస్తూపోతున్నారుగాని ఒక్కరు కూడా ఆగి అటు తొంగిచూడడంలేదు. నాకేమి చేయాలో తెలియక నడిరోడ్డున నిల్చున్నాను. అపుడా అమ్మాయి నావేపు చేతులు చాచి ‘నన్ను కాపాడండి!’ అని అరిచింది. ఇక నేను ఊరకుండలేకపోయాను. ఇంటర్వ్యూ సంగతి నా బుర్రలోంచి ఎగిరిపోయింది. పరుగెత్తుకెళ్లి ఆ దుండగుల్ని రఫ్‌గా హ్యాండిల్‌చేసి, ఆ అమ్మాయిని వాళ్ల బారినుంచి విడిపించి, ఆటో పట్టుకుని ఇక్కడికి చేరేటప్పటికి ఆలస్యం అయింది మేడమ్. జస్ట్ ఎ ఫ్యూ మినిట్స్’.

అతడిలోని తత్తరపాటు గమనించి ఆమె పెదవుల మధ్య కనిపించీ కనిపించని హాసరేఖ మెరిసి మాయమైంది. లేచి రూమ్ మధ్యకు వచ్చి ‘అది సరే – మాన్‌సింగ్‌నగర్ గుడుంబా తయారీకి కేంద్ర స్థలం కదూ! అది రౌడీషీటర్ల అడ్డా అని కూడా విన్నాను. అక్కడా మీరుంటున్నారు?’ అని అడిగింది.

‘నో మేడమ్! మా ఇల్లు అక్కడ లేదండి. దానికి దూరాన ఉన్న శ్రీనివాస కాలనీలో ఉంటున్నాం. ఇటు బస్టాప్ వేపు రావాలంటే షార్ట్‌కట్ మార్గాన మాన్‌సింగ్‌నగర్ దాటి రావాలండి’.

అప్పుడు ఎవ్వరూ అనుకోని విధంగా ఒక యువ ఆఫీసర్ రేకు కప్పుపైన వడగండ్ల వాన కురిసినట్లు చప్పట్లు కొట్టనారంభించాడు. అతడలాగే చప్పట్లు కొడ్తూ అన్నాడు – ‘అంటే మన కంపెనీకి ఒక బోల్డ్ అండ్ డేషింగ్ హీరో వస్తున్నాడన్నమాట!’

ఆ అదనుచూసి రెండవ యువ ఆఫీసర్ కూడా తాడు కొస జారనివ్వకుండా అందుకున్నాడు – ‘అయ్యా హీరో నంబర్ వన్‌గారూ! అసలు ఆ మాన్‌సింగ్ ప్రాంతం ఎవరిదనుకున్నారు? అప్పటి ప్రసిద్ధిగాంచిన థగ్ తెగలవారిది. వాళ్ల పేరు చెపితే పోలీసులకు సైతం గుండె దడ పుట్టుకొస్తుంది. అక్కడ డ్యూటీపడితే జ్వరం వచ్చిందని మెడికల్ సర్టిఫికేట్లు అందించి పోస్టింగ్ నుంచి తప్పుకుంటారు. అటువంటి వాళ్ల ఏరియాకి వెళ్లి – వాళ్లతో ఢీకొట్టి వచ్చానంటున్నారు. అది మమ్మల్ని నమ్మమంటున్నారు. అంతేనా మిస్టర్?’

వాళ్లిద్దరి పోకడా నీలకంఠానికి నచ్చని

ట్లుంది. ముఖంలో రంగులు మారసాగాయి. పైకి పేలకుండా ఉండేందుకు – 'నిగ్రహం కోల్పోకు నీలకంఠా! ఇటువంటి యిక్కట్టయిన పరిస్థితిలో నిదానమే అతి ప్రదానం!' అని మన సున మననం చేసుకుని దవళ్లు గిట్టకరచు కున్నాడు.

అప్పుడు డిప్యూటీ ఎం.డి. నోరు మెదప కుండానే నిదానంగా తలతిప్పి ఒక డీప్ లుక్ ఇచ్చింది. అంతే! ఆ ఒక్క చూపుతో బేల ముఖా లు పెట్టుకుని జారుకున్నారిద్దరూ. అందరూ నిష్క్రమించిన తరువాత డిప్యూటీ ఎం.డి. అతడి వైపు నడిచివస్తున్నపుడు ఆమెను అక్కడే ఆగ మన్నట్లు నిశిత దృష్టితో నిలదీసాడు.

'బహుశాః మీకెవ్వరికీ నా మాటలపై నమ్మ కం కుదిరినట్లు లేదు మేడమ్!'

దానికామె చిన్నటి నవ్వుతో చూసి 'నలిగిన మీ జుత్తు, చెదిరిన దుస్తులూ చెప్తున్నాయి దారిమధ్యలో యేదో జరిగి ఉంటుందని. ప్లీజ్ డోంట్ ఫీల్ బ్యాడ్ ఫర్ దెయిర్ కామెంట్ మిస్టర్...' అమె అక్కడలా ఆగిపోవడం చూసి నీలకంఠం ఆ వ్యాక్యాన్ని తన పేరుతో పూర్తి చేసాడు.

'నీలకంఠంగారూ! వచ్చి కూర్చోండి'.

దానికతడు గౌరవపూర్వకంగా తల క్రింద కు వంచి 'థేంక్స్' అన్నాడేగాని ఆమె చూపించిన మన్నన అందుకోలేదు.

ఈసారి ఆమె గొంతులో అధికార హోదా ఫెళ్లుమని ధ్వనించింది. 'వుడ్ యూ ప్లీజ్ సిట్ డౌన్ మిస్టర్ నీలకంఠం!'

ఏదో అదృశ్యశక్తి దిగ్బంధనానికి లోనయి నట్లు అతడు మౌనంగా కదిలి వచ్చి కూర్చు న్నాడు. ఆ లోపల వాళ్ల లేడీ స్టెనో 'మే ఐ కమిన్ మేడమ్' అంటూ ప్రవేశించింది. ఆమె వెనకే వచ్చిన అటెండరు నీలకంఠం వైపు గుడ్లప్పగించి చూస్తూ టీపాయ్‌పైన మంచినీళ్ల గ్లాసులు పెట్టి, ఆ తరువాత రెండు కాఫీ కప్పు లూ, బిస్కట్లూ ట్రేలో సర్దిపెట్టి వినయంగా సాల్యూట్‌చేసి వెళ్లిపోయాడు.

డిప్యూటీ ఎం.డి. అతడి ముందుకు కాఫీ కప్పు ముందుకు తోస్తూ యధాలాపంగా చూస్తూ అడిగింది – 'బైదిబై మీరిలా చాలామందికి సహా యం చేస్తుంటారా?'

ఆ మాటల్లో వ్యంగ్యం ఎక్కడైనా పొంచి ఉందేమోనని తెల్చుకోవడానికి నీలకంఠానికి కొద్దిసేపు పట్టింది. టెన్షన్ వల్ల అపరిమితమైన దాహార్తి కలిగిందేమో – రెండు గుటకల్లో మంచినీళ్ల గ్లాసు ఖాళీచేసి, చటుక్కున యిటు తిరిగి – 'పార్డన్ మేడమ్... మీరేదో అడిగినట్లు న్నారు' అన్నాడు.


'జస్ట్ అవుటాఫ్ ఇంటరెస్ట్ అడుగుతున్నాను. ఆ హైస్కూలు అమ్మాయి దుండగుల బారినుండి తప్పించుకున్న వెంటనే పరుగుపరుగున వెళ్లిపో యిందా? లేక మీ దగ్గరకు వచ్చి ధన్యవాదా లర్పించి వెళ్లిందా?'

'నేనది గమనించలేదు మేడమ్. అయినా చేసిన సహాయానికి ప్రతిఫలమేదీ యెదురు చూడకూడదంటారు'.

'ఎవరు?'

'అమ్మ అంటుంది. అలా ఎదుటివారికి సహాయం చేయగల అవకాశం యిచ్చిన ఆ భగవంతుడికే ఆ కృతజ్ఞతలు చెందుతాయం టారు'.

'ఓకే ఓకే! మీ అమ్మగారి అభిప్రాయంతో నాకెటువంటి డిస్‌అగ్రిమెంట్ లేదు. మరొక చిన్న క్వశ్చన్. ఇది కూడా అవుటాఫ్ మై పర్స నల్ ఇంటరెస్ట్ వల్లనే. రేపోమాపో అదే



అమ్మాయి ఎక్కడైనా మిమ్మల్ని చూసి కూడా చూడనట్లు తలవిదిలిస్తూ వెళ్లిపోయిందనుకోండి – అప్పుడెలా రియాక్టవుతారు?'

ఈసారి నీలకంఠం ఆమెను తేరిపార చూసి – 'ఇఫ్ యూ డోంట్‌మైండ్ నాదొక చిన్న రిక్వెస్ట్ మేడమ్' అన్నాడు.

ఆమె చెప్పమన్నట్లు తలాడించింది.

'కంపెనీ సెలక్షన్ బోర్డ్ మెంబరు ఇక్కడే ఉంటారనుకుంటాను. వాళ్లనుగాని ఓసారి పిలిచి...'

'అలాగా! మరి నేనిప్పుడు చేస్తున్నదేమిటి? ఇంటర్వ్యూ అనిపించడంలేదా!'

నీలకంఠం కనుబొమలెగరేసి చూసాడు.

'సెలక్షన్‌కి ఛైర్‌పర్సన్ నేనేకదా! ఇక మీకెందుకా కంగారు? సిస్టమ్‌లో మీ బయోడేటా చూసేకదా మిమ్మల్నిక్కడ కూర్చోబెట్టింది'.

అతి పల్చటి వాయుతరంగాలలో ఏదో దిక్కున తేలిపోతున్నట్లు ఓ విచిత్రమైన గాఢత అతణ్ని ముప్పిరిగొంది. అదెప్పుడో సినిమాలో చూసినట్లు అందరూ నర్మగర్భంగా చేరి వాళ్ల వాళ్లకు తోచినట్లు తనను ఆటపట్టించడం లేదు కదా!

'ముందు కాఫీ తీసుకోండి నీలకంఠం గారూ!'

అతడేమీ అనలేదు. రెండు బిస్కట్లను కస కసా నోట్లో వేసుకుని, కాఫీ తాగడం పూర్తిచేసి, డిప్యూటీ ఎం.డి. వైపు తదేకంగా చూస్తూ కూర్చున్నాడు. ఆమె మాత్రం అదేమీ గమనించకుండా కాఫీ తాగనారంభించింది.

'సారీ మేడమ్. ఇంతకు ముందు మీరేదో అడిగినట్లున్నారు'

ఆమె బుర్రూపింది.

'రేపు ఆ అమ్మాయి నన్నెక్కడైనా చూసి

కూడా కప్పదాటువేసి వెళ్లిపోతే నేనేలా స్పందిస్తానేగా!'

అవునన్నట్లు ఆమె తలూపింది.

'నేనేమీ అనను. బహుశ ఫీలవను కూడా'.

ఆమె నవ్వి 'మరేం చేస్తారు?' అడిగింది.

'ఏమీ చేయను. నా దారిన నేను వెళ్లిపోతాను. నాకున్న సమస్యల కారణంగా ఆమెను నేనెన్నడో మరిచిపోయుంటాను'.

ఆమె మళ్లీ ఏమీ అనలేదు. అతణ్ని ఓర కంట చూస్తూ స్టెనో తెచ్చిన కవరు విప్పి అందులోని పేపర్లపై సంతకం చేసి, వాటిని మళ్లీ కవరులో ఉంచి నీలకంఠానికి అందించింది.

'అక్కౌంటెంటుల ఇంటర్వ్యూ ముగించి సెలక్షన్ పేపర్లపై అప్రూవల్ కూడా ఇచ్చేసాను. మీకు తెలియదేమో - ఈ కంపెనీకి ఛైర్మన్ - కమ్ - ఎండీ మా నాన్నగారే. నిర్ణయం తీసుకున్న తరువాత వ్యవహారాలను తిరగదోడడం ఆయనకు నచ్చదు. అందుచేత ఆ పోస్ట్ గురించి మరచిపోండి'.

మరి? అన్నట్టు చూసాడు నీలకంఠం.

'నాకంటూ ఉన్న కొద్దిపాటి విశేషాధికారాన్నీ వినియోగించి ఒక కొత్త పోస్ట్ క్రియేట్ చేసాను. నౌ - ఈజిట్ ఓకే?'

నీలకంఠం ఆతృతగా కవరులోని పేపర్లు బయటకు తీసి చూసాడు. తన కళ్లను తనే నమ్మలేనట్టు మరోమారు చూసుకున్నాడు. అతడికి ఆఫర్ చేసిన పోస్ట్ - ట్రైనీ అసిస్టెంట్ మేనేజర్. అతడికి నోట మాట పెగలక మౌనంగా లేచి నిల్చుని రెండుచేతుల్నీ జోడించాడు. ఆమె ఉన్నపాటున లేచి నిల్చుని జోడించిన అతడి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది. ఎదురుచూడని ఆమె చర్యకు అతడు వేగిరపాటుకి లోనయి దూరంగా జరిగాడు. ఆమె రెండు కళ్లూ చెమ్మగిల్లి ఉండడం చూసి - 'ఎనీ థింగ్ రాంగ్ మేడమ్?' అని కంగారుగా అడిగాడు.

ఆమె నవ్వడానికి ప్రయత్నిస్తూ - 'మీరెంతటి పిచ్చిమారాజులు నీలకంఠంగారూ! చిన్న చేపను చూపించి పెద్దచేపను బాదుకుపోయే ప్రపంచం ఇది! మిస్సయిల్ వేగంతో దూసుకుపోయే ఈ యిరుకు ప్రపంచంలో మీరింత తేటగా ఎలా ఉండగలుగుతున్నారో!'

అతడు అర్థరహితంగా చూసి, మెల్లగా ఆమె చేతుల్నుండి తన చేతులు విడుపించుకుంటూ - 'మీరు చెప్తున్నది నాకేమీ బోధపడడంలేదు మేడమ్!' అన్నాడు.

'నా ముఖంలోకి బాగా చూసి చెప్పండి'.

ఈసారి మరింత ఎడంగా జరిగి - 'మనమెప్పుడైనా కలసి చదువుకున్నామా మేడమ్?' అని అడిగాడు.

'నన్ను బాగా చూడండి గుర్తుకొస్తాను'.

నీలకంఠం తల అడ్డంగా తిప్పాడు.

'ఆనాటి కాళరాత్రిని జ్ఞప్తికి తెచ్చుకోండి. కాచిగూడ రైల్వేస్టేషన్ కళ్లముందుకు తెచ్చుకోండి. ఎక్కడో ఏదో ఘర్షణ రగులుతున్న కారణంగా నగరమంతా కలహాలతో వణికిపోయింది. ఊరంతా కర్ఫ్యూ విధించారు. అదేమీ ఎరక్కుండా వాస్కోడిగామా నుంచి బయలుదేరిన బండి ఆలస్యంగా చేరింది. తుళ్లిపడి కళ్లు తెరిచేటప్పటికి బెర్తు ప్రక్కనుంచిన సెల్ ఫోన్ మాయమైంది. టీసీకి ఫిర్యాదు వ్రాసి ఇచ్చి, కాచిగూడలో దిగేటప్పటికి అర్ధరాత్రి కావస్తోంది. పెట్టెబేడాతో దిగేటప్పటికి నన్ను రిసీవ్ చేసుకునేందుకు ఎవరూ రాలేదని తెల్సుకున్నాను. అటు వెళ్తున్న ఒకతణ్ని అడిగి ఆతడి

సెల్‌ఫోన్‌తో యింటికి కబురందించాలని ప్రయత్నించాను. కనెక్ట్ కాలేదు. జామర్స్‌తో ఫోనులన్నిటినీ ఇన్-యాక్టివ్ చేసినట్లున్నారు. గోరుచుట్టుపై రోకటి పోటంటే ఇదేనేమో!

స్టేషన్ మాస్టారు రూమ్‌లో తలదాచుకోవాలని చూపులు సారించి చూస్తే ఒక్కడంటే ఒక్క కూలీ కూడా కనిపించలేదు. అప్పుడనిపించింది - రూపాయి నోట్లంటే వాస్తవానికి పేపర్లే కదా అని. అలా ఆలోచిస్తూ రెండడుగులు అటు వేసానో లేదో చీకటి గూట్లో మాటేసిన చిరుతపులుల్లా ముగ్గురు దుండగులు నన్ను చుట్టుముట్టారు. అటువంటి పరిస్థితులు యెదురైనపుడు అమ్మాయిలెలా నడుచుకోవాలో నాకు ముందే కౌన్సిలింగ్ ఇచ్చారు కాబట్టి అన్ని నగలూ ఊడదీసి వాళ్ల చేతుల్లో ఉంచాను. తీసుకున్నవారు తీసుకుని పోకుండా అడ్డంగా వచ్చి, మేకపిల్లను ఎత్తుకున్నట్టు లాక్కొని నన్ను గుడ్స్‌బండివైపు లాక్కుపోతున్నారు. నేను అరవబోయాను. అది చూసి మూడోవాడు ఒక మురికిగుడ్డను నా నోట్లో కుక్కాడు. అప్పుడు నాకేమనిపించిందో తెలుసా - అటుగాని ఏదైనా ట్రైన్ వెళ్తే దానికడ్డంగా వెళ్లి పడిపోవాలనిపించింది. అప్పుడు మీరు బకాసురుణ్ని ఎదుర్కొనే భీమసేనుడిలా ప్రత్యక్షమయ్యారు. ఈరోజు నేనింకా మానప్రాణాలతో...'

అపుడు నీలకంఠం స్లీపింగ్ జైంట్‌లా తటాలున తేరుకున్నాడు. 'వన్ మినిట్ మేడమ్ - వన్ మినిట్. ఇప్పుడు నా కళ్లముందు అన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి అనంతపురంలో జరిగిన ఓ ఇంటర్వ్యూలో చతికిలబడి కసిగా, ఉక్రోశంగా చీకట్లో ఉన్న చప్టాపైన కూర్చున్నాను. దగ్గరకొచ్చిన నాన్నగారి రిటైర్‌మెంట్ జ్ఞప్తికి వచ్చి - పెళ్లిళ్లుకాని చెల్లెళ్లు కళ్లముందు మెదిలి తర్జనభర్జనలు పడసాగాను. ఆ ఊపుతో వాళ్లను వీరబాదుడుతో పరుగులు తీయించాను.'

ఇక నన్ను చెప్పనివ్వండి నీలకంఠంగారూ! ఆ ముగ్గురూ కలిసి మిమ్మల్నేమన్నా చేస్తారేమోనని గజగజలాడిపోయాను. పెద్దపెట్టున ఏడ్వనారంభించాను. నా ఏడుపు మీకు వినిపించలేదా?'

'లేదు. అటువంటి భీకరమైన ఘర్షణలో మునిగి ఉన్నపుడు ప్రక్కవాళ్ల అరుపుల గురించో - ఏడ్పుల గురించో పట్టించుకోవడం సాధ్యం కాదు కదా! అయితే ఒకటి - మీరు భావించినట్లే ఆ ముగ్గురు దుండగులూ భారీగా బిల్డప్ అయిన మనుషులే! కాబట్టి నాకేది జరిగినా ఆశ్చర్యంలేదు. ఏమైనా అది సినిమా సీను కాదు కదా! నాకు కూడా కొంచెం దెబ్బలు తగిలాయి'.

ఆమె కళ్లు పెద్దవి చేసుకుని చూసింది కలవరపడుతూ. 'నా మెడ నరాలు రెండు చిట్లాయి. వారంరోజులపాటుహాస్పటల్‌లోఉండటాన ధర్మారావుగార్కి బాగానే ఖర్చు అయినట్లుంది'.

'ఆయనెవరు?'

'ఇంకెవరు - మా నాన్నగారు'.

'నీ కోసం ఎక్కడెక్కడ వెదికానో తెలుసా?'

'ఎందుకు?'

'థేంక్స్ చెప్పడానికి'.

'నో మేడమ్... ఇప్పుడు నేనే కాదు మా కుటుంబమంతా మీకు థాంక్స్ చెప్పాలి'.

'సరేకానీ... నన్ను 'మేడమ్' అని పిలవడం మానేసి, వసంతా... అని పిలుస్తావా... కనీసం మనిద్దరం ఉన్నప్పుడయినా...

ఆమె గొంతులో మార్పు... ఆప్యాయత, అనురాగం, అంతకు మించిన ఏదో భావం ధ్వనించేలా... ●